# హింసాకాండ

అదొక ఇండియన్ సినిమా. తెలుగైనా, హిందీ అయినా, తమిళమయినా... అన్నీ ఒక మూసలోనించే వచ్చే కాపీలు కనుక ఏ భాష అనే ప్రసక్తి లేదు.

విలన్ అంతకుముందే హీరో తండ్రిని రాళ్ళతో కొట్టి, అతని తలని పచ్చడి చేశాడు. పక్కనే వున్న ఇనుప కడ్డీ తీసుకుని ఆయన కళ్ళల్లో పొడిచాడు. ఆయనా, ఆయన కళ్ళూ పడిపోయిన చోట వున్న మట్టి, ఆ మానవత్వపు విలువలు చూడలేక, తలెత్తుకోలేక మట్టి కరిచీ సిగ్గుతో ఎర్రబారింది. ఆ విషయం ఎగురుతున్న గద్దల ద్వారా హీరోకి వెళ్ళింది.

అప్పుడే హీరో వాళ్ళమ్మ ఆవకాయ పెడుతూ, పెద్ద కత్తితో మామిడి కాయలు తరుగుతున్నది. మన హీరో (నటన చేతకాని వీళ్ళని నటుడు అనటం నాకిష్టం లేదు. అందుకని సినిమాలోనూ, అభిమాన సంఘాలూ హీరోలా చేశారు కనుక హీరో అనే అందాం) ఆ కత్తి తీసుకుని, ముందు తన చేతి మీద ఒక గంటు పెట్టుకున్నాడు. చిందిన రక్తంతో తన తల్లికి బొట్టు పెట్టి, తనూ ఆ రక్త తిలకం పెట్టుకున్నాడు. పెద్దగా అరుచుకుంటూ, కత్తి గాలిలో ఎత్తి పట్టుకుని విలన్ ఇంటికి వచ్చాడు. విలన్నీ, అక్కడవున్న అతని పరివారాన్నీ ఊచకోత కోశాడు. చేతులూ, కాళ్ళూ, తలకాయలూ తెగి క్రింద పడుతున్నాయి. నేలంతా రక్తమయం.

సినిమా చూస్తున్న చిన్న పిల్లలు భయంతో వాళ్ళమ్మల ఒళ్ళో చేరారు. వాళ్ళమ్మలూ, నాన్నలూ పిల్లల్ని దగ్గరికి తీసుకుని భయపడ వద్దని ఓదారుస్తూ, ఎవరి కళ్ళు వాళ్ళు మూసుకున్నారు. ఎదిగిన (!) ప్రేక్షకులు ఈలలు వేస్తున్నారు. సంతోషంతో తప్పట్లు కొడుతున్నారు. మానవత్వం ఆ ఏసి సినిమా హాల్లో మళ్ళీ మట్టి కరిచింది. ఆ సినిమా రజతోత్సవం జరుపుకున్నది. హీరో నటశూన్యకీ, హీరోయిన్ భాషరాని బొడ్డుశ్రీకి, రచన చేసిన బూతు సోదరులకీ, దర్శక నిర్మాతలైన 'మన' వాళ్ళందకీ - వారిని ఆనందపరుస్తూ 'నందులు' ఇచ్చారు రాష్ట్ర శ్రీప్రభుత్వం వారు. మహారాజశ్రీప్రభుత్వం వారు పెద్దవారు కనుక 'పద్మ'లు ఇచ్చారు.

మరి ఈ ప్రేక్షకుల మనస్థత్వం ఎలా వుంటుంది? ఎలాటి మార్పులు చెందుతుంది?

0 0 0

అదొక హాలీవుడ్ సినిమా. ఆర్ రేటెడ్ పెద్ద పెద్ద అక్షరాలతో 'హారర్ సినిమా-పెద్దలకు మాత్రమే' అని వ్రాశారు. అంటే పిల్లలకి టిక్కెట్లు ఇవ్వరు, సినిమా

హాల్లోకి రానీయరు. చాల ఖచ్చితంగా వుంటారు. అంతేకాదు మామూలు టీవీలో పిజి, ఆర్, ఎన్.సి.17 మొదలైన రేటింగ్ వున్న సినిమాలని ఎడిట్ చేసి అందరూ కుటుంబాలతో, పిల్లలతో సహా, అవి చూసేటట్టు జాగ్రత్తపడతారు. అదే కేబుల్ టీవీలో అయితే, పేరెంటల్ కంట్రోల్ టెక్నాలజీ ద్వారా, పిల్లలు అలాటివి చూడకుండా చేస్తారు పెద్దలు.

ఇంత చేసినా, పిల్లల సంగతి సరే, మరి అలాటి సినిమాలు చూసే పెద్దల సంగతి? వారి మనస్థత్వం ఎలా వుంటుంది? ఎలాటి మార్పులు చెందుతుంది?

0 0 0

రోజూ ప్రొద్దున్నే ఏడు గంటలకల్లా ఆఫీసుకి బయల్దేరతాను నేను. ఆరున్నరకల్లా సిద్ధమయి, ఒక గ్లాసు నిండా కలో (పాలో), గంజో (కాఫీనో) నింపుకుని, అది తాగుతూ కంప్యూటర్లో తెలుగు పేపర్లు చదవటం ఒక అలవాటయి పోయింది. ఆంధ్రభూమి ఆంధ్రజ్యోతి ఈనాడులలో హెడ్డింగులు చదువుతాను. ఏవయినా వార్తలు ఆకర్షిస్తే వాటి మీదకి పోతుంది దృష్టి. సాహిత్యం మీద ఏదున్నా చదవటం మాత్రం తప్పదు. నాకు వుండే సమయం అరగంటే కనుక, చకచకా చూసేస్తాను. చదివేస్తాను. మరీ పెద్దవయితే, రాత్రి చదువుకోటానికి అట్టిపెట్టుకుంటాను.

ఏ ఒక్కరోజు వార్తలు చూసినా ఏమున్నది గర్వ కారణం? మత కలహాల రక్త తర్పణం, రాజకీయ నాయకుల గూండాయిజం, ఎన్‌కౌంటర్లు, మాఫియాలూ, బాంబు దాడులూ, హత్యలూ, మానభంగాలూ, హింసాకాండ.

ప్రభుత్వంలోనూ, ప్రముఖుల్లోనూ, ప్రజల్లోనూ, ప్రతిచోటా... అదే!

సినిమాలు చూసి ప్రజలు నేర్చుకుంటున్నారా? ప్రజల కథలనే సినిమాలుగా తీస్తున్నారా? ఎవరికైనా దీనికి జవాబు ఏమిటో ఆలోచించే తీరికా, అవసరం వున్నాయా?

0 0 0

ఏం బాబూ! అమెరికాలో హింసాకాండ లేదా, ఏదో అంతా ఇండియాలోనే వుందన్నట్టుగా చెబుతున్నావు?

ఉంది. లేదని ఎలా అంటాం. ఇక్కడా ఎన్నో హత్యలు, కొద్దిపాటి మానభంగాలూ కనిపిస్తాయి. మిగతావి, అంటే మత కలహాల రక్త తర్పణం, రాజకీయ నాయకుల గూండాయిజం, ఎన్‌కౌంటర్లు, మాఫియాలూ, బాంబు దాడులూ - 9/11కి సంబంధించినవి తప్ప - నేను ఇంతవరకూ వినలేదు.

ముత్యాలముగ్గు సినిమాలో రావు గోపాలరావు అన్నట్టుగా ఎక్కడ ఎన్ని జరుగుతున్నాయి అన్నది కాదు ముఖ్యం, అసలు ఈ హింసాకాండ ఎందుకు అనేది పాయింటు.

0 0 0

నాలుగు రోజుల క్రితం నేను ఇద్దరు అమెరికన్ మిత్రులతో కలిసి, లంచ్ చేద్దామని ఒక రెస్టారెంటుకి వెళ్ళాను. శుక్రవారం మధ్యాహ్నం కనుక కొంచెం తీరిగ్గానే వుంది.

బాబ్ వియత్నాం యుద్ధంలో పాల్గొన్నాడు. అక్కడ ఎన్నో అడవుల్లో, వూళ్ళల్లో దాదాపు రెండున్నర సంవత్సరాలు పనిచేశాడు. రెండవది కెవిన్. పెద్ద బుష్ హయాంలో ఇరాక్ - కువాయట్ యుద్ధంలో ఒక సంవత్సరం పాటు పోరాడిన మనిషి.

ముగ్గురం కావలసినవేవో ఆర్డర్ చేసి, దగ్గరే గోడ మీద అమర్చిన టీవీలో సి.ఎన్.ఎన్. వార్తలు వస్తుంటే చూస్తున్నాం. ఒక సైకాలజిస్ట్‌తో 'యుద్ధం తర్వాత వుండే మానసిక అలజడి' (పోస్ట్ వార్ ట్రోమా) మీద కొన్ని ప్రశ్నలు అడుగుతున్నది వార్తా ప్రతినిధి. మేం ముగ్గురం ఒక్కసారిగా మౌనవ్రతం పాటించి దీక్షగా వింటున్నాం.

వారిద్దరి మధ్యా జరిగిన సంభాషణ మూడు నిమిషాలే అయినా, మాలో ఎన్నో ప్రశ్నలు రేపింది. తర్వాత ఒక అరగంట ఆ విషయం మీదే చర్చించాం కూడాను. బాబ్, కెవిన్ ఇద్దరూ యుద్ధంలో పోరాడిన వారే కనుక, నాకు చాల కొత్త విషయాలు చెప్పారు. టీవీలో కూడా ఎన్నో గణాంకాలు చెప్పారు. అవన్నీ పూర్తిగా గుర్తు లేకపోయినా, గుర్తున్నవి కొన్నీ, అక్కడే వున్న పేపర్ నేప్‌కిన్ మీద గబగబా వ్రాసుకున్నవి కొన్నీ కలిపి ఈ కబుర్లు వ్రాస్తున్నాను.

నా చిన్నప్పుడు నా కళ్ళ ముందే ఎవరో ఒక ఈగని చంపితే విలవిల్లాడిన మనిషిని నేను. అందుకే నేనే చాల ప్రశ్నలు అడిగాను వాళ్ళని. యుద్ధంలో పోరాడే వాళ్ళల్లో చాలమంది ఇరవై - ముప్ఫై ఏళ్ళ మధ్య వయస్కులు. రెండేళ్ళ పాటు అందర్నీ వదిలి అడవుల్లోనూ, ఎడారుల్లోనూ, భాష తెలియని దేశాల్లోనూ, గుప్పిట్లో ప్రాణాలు పెట్టుకుని జీవించటం మాటలు కాదు. దాదాపు ప్రతి సైనికుడూ, కనీసం ఒకళ్ళనీ, మామూలుగా చాలమందినీ చంపుతూనే వుంటారు. అప్పుడు వారి మనోభావాలు ఎలా వుంటాయి? వారిలో కొందరు మతపరంగా పాపభీతి కలవారు కూడాను. మరి దాని ప్రభావం వారి మీద ఎలా వుంటుంది? జీవితాంతం వారిని వేధిస్తూనే వుంటుందా? జనాన్ని చంపీ చంపీ అలవాటు పడిపోతారా? కసాయివాడి మనస్తత్వం వచ్చేస్తుందా?

ఇవన్నీ నా చాదస్తపు ప్రశ్నలే కాదు, టీవీలో అడిగిన ప్రశ్నలూ, రీసెర్చి చేసిన ప్రశ్నలూను. వాటికి టీవీలో చెప్పిన జవాబులూ; బాబ్, కెవిన్ తమ స్వానుభవంతో చెప్పిన జవాబులూ, తత్సంబంధమైన గణాంకాలూ, అవన్నీ పూర్తిగా వినే దాకా నా కాలు కదపనివ్వలేదు.

దీనివల్ల నాకు అందిన సమాచారం, ఎంతో ఆశ్చర్యం కలిగించే విధంగా వుంటే, భవితవ్యపు మానవతా విలువల మీద కొన్ని అనుమానాలూ మిగిల్చింది.

అవన్నీ వచ్చే వారం చూద్దాం.

అప్పటి దాకా ఓం శాంతి! శాంతి! శాంతి!

0 0 0